క్లుప్తంగా

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బక్రీద్ పండుగను మతసామరస్యం పాటిస్తూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ సీతారామయ్య సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసిమెలిసి పండుగలు నిర్వహించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొంటే చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, తహశీల్దార్ ఆంజనేయులు, పట్టణ, రూరల్ సీఐలు మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రావు, మత పెద్దలు ఖాశీంబేగ్, వాహిద్, అతావుల్లా, సీఫతుల్లా, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: ఈనెల 29న బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ యుగంధర్ సూచించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగ నిర్వహణపై ముస్లిం పెద్దలకు పలు సూచనలు చేశారు.

లారీ బోల్తా: ఒకరికి గాయాలు



ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామ సమీపంలో బుధవారం రాత్రి లారీ బోల్తా పడిన సంఘటనలో ఒకరికి గాయాలైనట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మన్న గురువారం తెలిపారు. బళ్లారి నుంచి నంద్యాలకు మట్టిని తీసుకెళ్తున్న లారీ అట్టికల్లు వద్ద అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మధుకు గాయాలయ్యాయి. పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన డ్రైవర్‌ను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాధ్యతల స్వీకరణ



హాలహర్వి: మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతామని నూతన ఎస్ఐ నాగేంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం హాలహర్వి మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్ జలదుర్గం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

వంట నిర్వాహకులను నియమించాలి

ఆలూరు రూరల్: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంట నిర్వాహకులను నియమించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ధనుంజయ మాట్లాడుతూ.. గత 18 నెలలుగా వేతనాలు అందని కారణంగా వంట నిర్వాహకులు రావడం లేదన్నారు. దీంతో గిరిజన పాఠశాల ఇంకా తెరుచుకోలేదని చెప్పారు. ఈ విషయమై జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులును వివరణ కోరగా.. ఆలూరు ట్రైబల్ గురుకుల పాఠశాలలో వంట నిర్వాహకులకు 18 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్ర ఎస్టీ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు చర్యలు

వెల్దుర్తి: బ్రహ్మగుండం సమీపంలో 300కు మించి ఇళ్ల పట్టాలు, 200 వరకు అనుబంధ పట్టాలు ఇచ్చిన జగనన్న లేఅవుట్‌లో థర్డ్ పార్టీ ద్వారా ఇళ్లు నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావ్, హౌసింగ్ ఏఈ అరవింద్, తదితరులు లబ్ధిదారులతో సమావేశమయ్యారు. దాదాపు 200 మందికిపైగా లబ్ధిదారులు కాంట్రాక్టర్ నిర్మాణానికి అంగీకరించడంతో వారిచే ఐసీఐసీఐ బ్యాంకు ఖాతా ప్రారంభించి ఎంఓయూ పొందారు. త్వరలో నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

హోంగార్డులకు వైద్య పరీక్షలు

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలోని శ్రీరామ హాస్పిటల్‌లో గురువారం సీఐ కె.మురళీమోహన్ విజ్ఞప్తి మేరకు పోలీసుశాఖలో పనిచేస్తున్న హోంగార్డులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి రాఘవేంద్ర ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది హోంగార్డులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎండీ నీలకంఠ, డాక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో గురువారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మంజూరైన రూ.10 వేలు నగదును బాధితురాలు శాంతమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరభద్రి, సచివాలయం సిబ్బంది అందజేశారు. కైరుప్పలకు చెందిన గుడ్ల వీరేష్ (38) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైంది. మిగతా మొత్తం తర్వలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సునీత తెలిపారు.

మరింత రుచిగా జగనన్న గోరుముద్ద

- రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- వారంలో వేరుశనగ చిక్కీతో పాటు నాలుగు రోజులు ఉడికించిన గుడ్డు
- రోజు విడిచి రోజు రాగి జావ
- వడ్డించే ఆహారం మోతాదును పెంచిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు





విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు, మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా పేదలే. వారికి నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంతో పాటు చదువుల్లో రాణిస్తారు. ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశ పెట్టారు. అలాగే చిన్నారులకు పోషక విలువలు పెంచేందుకు వారంలో రోజు చిక్కీతో పాటు ఉడికించిన గుడ్డు ఆహారంలో అందిస్తూ గోరుముద్ద మరింత రుచికరంగా చేశారు. ఈ ఏడాది నుంచి వారంలో 3 రోజులు ఉదయం 9 గంటలకు రాగి జావ అందిస్తున్నారు. గుడ్డు సైజు, వడ్డించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోంటోంది. గతంలో వారంలో మూడుసార్లు మాత్రమే గుడ్డు సరఫరా చేస్తుండగా తాజాగా రోజూ సరఫరా చేస్తున్నారు. ఏ వారం అందించే గుడ్డుపై ఆ రంగులను ప్రభుత్వం ముద్రిస్తోంది. దీంతో విద్యార్థులకు తాజా గుడ్లు అందించేందుకు వీలుగా ఉంటుందని ఉపాధ్యాయులు వంట ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

మధ్యాహ్న భోజనంపై పెరిగిన పర్యవేక్షణ

గతంలో మధ్యాహ్న భోజనం పథకం అమలుపై ఎలాంటి పర్యవేక్షణ ఉండేది కాదు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆ పాఠశాల హెచ్ఎం మాత్రమే మధ్యాహ్న భోజనం కమిటీ సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం జగనన్న గోరుముద్ద అమలుపై పర్యవేక్షణ, పథకం సమర్థవంతంగా అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు వారి విధుల్లో భాగంగా మండల కేంద్రాలకు, గ్రామాలకు వెళ్లినప్పుడు మధ్యాహ్న భోజనం నిర్వహణపై తనిఖీ చేయాలని ఆదేశాలు జారీచేసింది. అలాగే ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, ప్రధానోపాధ్యాయులు పీఎంసీ కమిటీలు, గ్రామ/వార్డు సచివాలయ అధికారులు పర్యవేక్షణ కమిటీ బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద నాణ్యతగా, పౌష్టికంగా అందుతోంది.

పెరిగిన ధరలకు అనుగుణంగా

నిత్యావసర ధరలు పెరగడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బంది పడేవారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతో వంటకు అయ్యే ఖర్చును ప్రభుత్వం పెంచింది. ఆలూరు మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలల్లో 9,196 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇదివరకు మధ్యాహ్న భోజనం ఖర్చు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.97 ఇస్తుండగా తాజాగా రూ.5.45లకు పెంచారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గతంలో రూ.7.45 ఉండగా ఇటీవలే రూ.8.17లకు పెంచారు. దీంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న గోరుముద్ద రోజువారీ మెనూ

సోమవారం:	పులావు/హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
మంగళవారం:	ఉదయం రాగిజావ, నిమ్మకాయ పులిహోర, పచ్చడి, గుడ్డు
బుధవారం:	కూరగాయల అన్నం, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం:	ఉదయం రాగిజావ, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం:	ఉదయం రాగిజావ, ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగల్

నాణ్యతగా భోజనం



మా పాఠశాలలో రోజు నాణ్యమైన భోజనం వడ్డిస్తారు. నేను కడుపు నిండా తింటున్నాను. వారంలో ఒక్కోరోజు ఒక రకమైన భోజనం వడ్డిస్తారు. ఉదయం పాఠశాలలకు రాగానే రాగి జావ ఇస్తున్నారు. అన్నంలో ఉడికించిన గుడ్డు ఇస్తారు. భోజనం అనంతరం చిక్కీ ఇస్తున్నారు. ఒంటిపూట బడి ముగిసిన అనంతరం 11.30 గంటలకు అన్నం తిని ఇంటికి పోతున్నాం.

– శృతి, హత్తిబెళగల్, జెడ్పీ పాఠశాల, 9వ తరగతి,

ఉదయం రాగి జావ ఇస్తున్నారు



నేను ఆలూరు గవర్నమెంట్ బాలుర స్కూల్–2 లో 9వ తరగతి చదువుతున్నాను. మంగళ, గురు, శుక్రవారాల్లో ఉదయం 9 గంటలకు రాగిజావ ఇస్తారు. రోజు మధ్యాహ్నం ఒక రకమైన భోజనం వడ్డిస్తున్నారు. ఉడికించిన గుడ్డుతో పాటు భోజనం అనంతరం చిక్కీలు తింటున్నాను. గతంలో ఒకే రకమైన అన్నం పెట్టేవారు. దీంతో ఇంటికి వచ్చి తినేవాడిని. ఇప్పుడు రోజు పాఠశాలలోనే తింటున్నాను. చాలా రుచిగా ఉంది.

– రాము, ప్రభుత్వ పాఠశాల–2, ఆలూరు, 9వ తరగతి

ఎఫ్ఏపై చర్యలు తీసుకోండి

గోనెగండ్ల: పుట్టపాశం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నపై చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. గురువారం దాదాపు 60 మంది కూలీలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఉపాధి పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ప్రతి రోజూ పనులకు వస్తున్నా హాజరు వేయడం లేదని వాపోయారు. తనకు అనుకూలంగా ఉన్న వారికే హాజరు వేస్తూ ప్రశ్నిస్తే ఎవరికైనా చెప్పుకోండంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: నర్సాపురానికి చెందిన బోయ మహాలక్ష్మి గురువారం ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె మండలం రామకృష్ణాపురానికి చెందిన మహాలక్ష్మికి నర్సాపురం రామాంజనేయులుతో వివాహమైంది. ఇద్దరు ఆడపిల్లలు గల మహాలక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో మధ్యాహ్నం నిద్రమాత్రలు మింగింది. కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పగా ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

నేడు హాలహర్వికి మంత్రి రాక

ఆలూరు: హాలహర్విలో సన్న, చిన్నకారు రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్ల పంపిణీతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు శుక్రవారం మంత్రి గుమ్మనూరు జయరాం వస్తున్నట్లు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు బోయనెట్టకంటమ్మ, లింగప్ప గురువారం తెలిపారు.

26న ఆవుల క్రయవిక్రయాలు బంద్

పత్తికొండటౌన్: పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పశువుల సంతలో ఈనెల 26వ తేదీన ఆవుల క్రయవిక్రయాలు బంద్ చేసినట్లు కార్యదర్శి కార్నలీస్ గురువారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకలు, గేదెలు, ఎద్దుల క్రయ, విక్రయాలు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం



ఎమ్మిగనూరు 24వ వార్డులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 24వ వార్డులో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ రుద్రాక్షల బజారిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చొరవతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని హాలహర్వి గ్రామ పంచాయతీలోని జగ్గాపురం గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, అందిన సాయంపై ఆరా తీశారు. గ్రామస్తులు అడిగిన తాగునీరు, సీసీ రోడ్లు సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి, మునెమ్మ, హనుమంతమ్మ ఎంపీడీఓ దశరథ రామయ్య, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



బాధితుడి తల్లికి నగదు అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న వ్యక్తి చికిత్స కోసం తమవంతు సాయంగా విరాళాలు సేకరించి తోడుగా నిలిచారు ఆ యువకులు. వెల్దుర్తికి చెందిన పంక్చర్‌షాప్ జాఫర్ కుమారుడు షేక్ ఉమీద్ బాష (24) బ్రెయిన్ ట్యూమర్‌తో ఏడేళ్ల క్రితం చికిత్స పొందాడు. ప్రస్తుతం మరోసారి చికిత్స చేయించుకోవాల్సి ఉండగా ఆపరేషన్‌కు రూ.7 లక్షలు అవసరమయ్యాయి. బాధితుడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న పట్టణానికి చెందిన సి.జాకిర్, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు చక్రపాణిరెడ్డి మరికొందరు విరాళాలు సేకరించేందుకు సోషల్ మీడియాను ఆశ్రయించారు. మంగళవారం జాఫర్ పరిస్థితి తెలుపుతూ పోస్టులు పెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి రూ.30 వేలు, వెల్దుర్తి గొల్ల బాలయ్య కుమారుడు రూ.10 వేలు ఇలా పలువురు విరాళాలు అందించారు. రూ.89 వేలు పోగుకావడంతో గురువారం ఉమీద్ తల్లికి అందించారు. ఇదిలాఉండగా బాధిత కుటుంబసభ్యులు అప్పు చేసి గురువారం హైదరాబాద్‌లో ఉమీద్‌బాషకు బ్రెయిన్ సర్జరీ చేయించారు. చికిత్స విజయవంతమైనట్లు వైద్యులు తెలిపారు

గంజిహళ్లిలో ఉద్రిక్తత



గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామంలో ఇటీవల మైనర్ బాలికపై అత్యాచార యత్నం కేసుకు సంబంధించి గురువారం ఉద్రిక్తత నెలకొంది. ఘటనలో అరెస్టయిన ఇద్దరు నిందితులతో పాటు మరో ముగ్గురి ప్రమేయం ఉందని, వారిపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని గురువారం బాధిత కుటుంబ సభ్యులు కర్నూలులో ఉన్నతాధికారులను కలిసేందుకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఘటన జరిగిన రోజే నిందితులను అరెస్టు చేశామని పోలీసులు చెప్పగా, మరికొందరి ప్రమేయం ఉందని వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లనివ్వాలని కోరడంతో బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన బాలిక తల్లి లక్ష్మి, తండ్రి అర్జున్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. గ్రామస్తులు, పోలీసులు వారిపై నీళ్లు పోసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో లక్ష్మి పెట్రోల్ తాగడంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. ఆమె సొమ్మసిల్లి పడిపోవడంతో గ్రామస్తులు ఆటోలో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారానికి యత్నించిన వ్యక్తి, అతనికి సహకరించిన భార్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ ఘటనలో నిందితులకు ఇంకా ఎవరైనా సహకరించి ఉంటే విచారణ జరిపి వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు.

2వ తరగతి విద్యార్థికి విద్యుత్ షాక్

- రాగిజావ గ్లాసు కడుక్కునే క్రమంలో ప్రమాదం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకేష్



ప్రమాదానికి కారణమైన స్టార్టర్ ఐరన్ పోల్

వెల్దుర్తి: రెండో తరగతి విద్యార్థి రాగి జావ తాగి గ్లాసును కడుక్కునేందుకు వెళ్లగా విద్యుత్ స్టార్టర్ ముట్టుకొని షాక్‌కు గురైన ఘటన రామళ్లకోట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవి, మహాలక్ష్మిల కుమారుడు లోకేశ్ స్థానిక ఎంపీపీ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలలో రాగిజావ తాగి గ్లాసు కడుక్కునేందుకు పాఠశాల కాంపౌండ్ ఆనుకుని ఉన్న పంచాయతీ కుళాయిల వద్దకు వెళ్లాడు. ఆ పక్కనే బోరు మోటారుకు సంబంధించిన స్టార్టర్ బిగించిన ఐరన్ పోల్ ఉంది. ఈ క్రమంలో పట్టుకోసం స్టార్టర్ బిగించిన పోల్‌ను పట్టుకున్నాడు. అయితే వైరు ఎర్త్ కావడంతో చిన్నారి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అటుగా వెళ్తున్న వ్యక్తి అమాంతం చిన్నారిని లాగేశాడు. ఈ ప్రయత్నంలో అతను కూడా షాక్‌కు లోనయ్యాడు. లోకేష్ చేయి, వీపు భాగంలో చర్మం కాలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ ఏఈఈ రాఘవేంద్రరెడ్డి, లైన్‌మన్ రమేశ్ రామళ్లకోటకు చేరుకొని స్టార్టర్ వద్ద మరమ్మతులు చేపట్టారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం

ఆలూరు రూరల్: భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను వాడడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటేష్ గౌడ్ సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార భూములను గుర్తించవచ్చని, ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం వల్ల పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. ఒక ఆర్బీకే పరిధిలో 9 మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు ఏఓ తెలిపారు. రైతులు అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

వేతనాలు చెల్లించాలి

తుగ్గలి: రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఐదుగురు వర్కర్లకు 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో వర్కర్లతో కలిసి ఆందోళన చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఆలూరు రూరల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఏఈ లోకేష్ అన్నారు. ఆయన గురువారం కమ్మరచేడు సబ్‌స్టేషన్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. బోరు కింద విద్యుత్ కనెక్షన్ కలిగిన రైతులు విద్యుత్ సరఫరాలో లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకోరావాలన్నారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్ కావాల్సిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం నేరుగా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అధికారులు, రైతులు, లైన్‌మెన్లు హాజరయ్యారు.

ఆస్పరి: వ్యవసాయ విద్యుత్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ మల్లికార్జున సూచించారు. గురువారం ఆస్పరి సబ్ స్టేషన్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు నెల రోజుల్లోపే ఇస్తామన్నారు. ప్రమాదాల నివారణకు జాగ్రత్తలను వివరించారు.

హాలహర్వి: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఈ జంబన్న అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో రైతులు, విద్యుత్‌శాఖ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. రైతులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే విద్యుత్ కనెక్షన్ మంజూరుచేస్తామన్నారు.

మద్దికెర: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఎస్ఈ ఉమాపతి పేర్కొన్నారు. గురువారం మద్దికెరలోని సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి ఇటీవల చేపట్టిన విద్యుత్ నవీకరణ పనులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వీడాలన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

మద్దికెర: పీఎం కిసాన్ పథకం కింద పంటలసాగుకు రూ.6 వేలు సాయం పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ రవి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి రైతు ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ చేయించుకోవాలన్నారు. వివరాలకు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

తుగ్గలి: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన గురువారం తుగ్గలి ఎస్సీ కాలనీలో పర్యటించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉంచరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

29న నాటక ప్రదర్శన

తుగ్గలి: సద్గురు కాశినాయన ఆరాధన మహోత్సవం పురస్కరించుకొని ఈనెల 29న రాత్రి రాంపల్లిలో సప్తమాంకములు ఉచిత నాటకం ప్రదర్శించనున్నట్లు కళాకారుడు రంగారావు తెలిపారు. వివిధ ప్రాంతాల కళాకారులచే పడకసీను, భవాని, రామాంజనేయ యుద్ధం, సుభద్ర రాయబారం, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర వారణాసి సీను, కాటిసీను ప్రదర్శనలు ఉంటాయన్నారు.

సామాజిక తనిఖీ వాయిదా

వెల్దుర్తి: మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన రూ.16.75 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి మండలస్థాయి 16వ విడత సామాజిక తనిఖీ (ఈనెల 24న శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ/పీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ.. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 23న శుక్రవారం నిర్వహించాల్సిన సామాజిక తనిఖీ అనివార్య కారణాల వల్ల 24వ తేదీకి వాయిదా పడిందన్నారు. ఎస్ఆర్‌ఈజీఎస్‌తోపాటు ఆ శాఖ నిధులతో పనులు జరిగిన పీఆర్, సెర్ప్, అటవీ, వెటర్నరీ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ శాఖలలోని పలు పథకాలపై తనిఖీ ఉంటుందన్నారు.

'జగనన్న సురక్ష' పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల కోసం జూన్ 1 నుంచి నిర్వహించనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో వార్డు సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు కావాల్సిన సర్టిఫికెట్ల వివరాలు తీసుకోవాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, సీసీఆర్సీ మ్యుటేషన్లు, ఫోన్‌నంబర్లకు ఆధార్ లింకేజీ 11 రకాల సర్టిఫికెట్లు త్వరితగతిన పంపిణీ చేసే ప్రక్రియ చేపట్టాలన్నారు. శుక్రవారం నుంచి శిక్షణ కార్యక్రమాలుంటాయని జూలై 1వ తేదీ నుంచి సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ నరసింహామూర్తి అన్నారు. గురువారం స్థానిక ఎంపీఈఓ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు.

హాలహర్వి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఆంథోని, తహసీల్దార్ మల్లికార్జునస్వామి ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

షెడ్యూల్ ఖరారు

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో జూలై నెల 1 నుంచి 19వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ గురువారం తెలిపారు. 1న లక్కసాగరం, కంబాలపాడు, 4న చిటాల్య, పోతుగల్లు, 6న చుంచుఎర్రగుడి, ఎరుకలచెర్వు, 11న ఎస్‌హెచ్ ఎర్రగుడి, కటారుకొండ, 13న ఆలంకొండ, కటారుకొండ, 15న అమకతాడు, టి.గోకులపాడు, 19న కృష్ణగిరి, తొగర్చేడు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు.

గోనెగండ్ల: మండలంలో జూలై 1 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ గురువారం తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి జూలై 1న పుట్టపాశం, వేముగోడు, 4న బి.అగ్రహారం, అలువాల, 6న గంజిహళ్లి, చిన్నమరివీడు, 7న బైలుప్పల, పెద్దమరివీడు, 11న కులుమాల, హెచ్.కై రవాడి-1, 13న పెద్దనేలటూర్-1, హెచ్.కై రవాడి-2, 15న పెద్దనేలటూర్-2, తిప్పనూరు, 18న గాజులదిన్నె, కున్నూరు, 20న నెరుడుప్పల, ఒంటిదుదిన్నె, 22న ఐరన్‌బండ, గోనెగండ్ల-3, 25న గోనెగండ్ల-1, గోనెగండ్ల-4, 27న గోనెగండ్ల-2 సచివాలయాల పరిధిలో ఇళ్ల సందర్శనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దేవ్‌సిన్హ చౌహాన్

పత్తికొండ రూరల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కేంద్ర కమ్యునికేషన్, ఐటీ శాఖ మంత్రి దేవ్‌సిన్హ చౌహాన్ సూచించారు. గురువారం స్థానిక శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి అధ్యక్షతన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమానికి బీజేపీ శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టాక దేశవ్యాప్తంగా లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేశామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేశామన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ సునీల్‌థియోడర్, ఓబీసీ మోర్చ జాతీయ కార్యదర్శి పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి కునిగిరి నీలకంఠ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.